క్లుప్తంగా

నాభిశిల ప్రతిష్ఠ..

తిరుమలాయపాలెం: మండలంలోని బంధంపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన నాభిశిల ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా నాభిశిల, ముత్యాలమ్మతల్లి సమేత పోతురాజుస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కాగా, ఆలయ అభివృద్ధికి కందాల రూ.లక్ష విరాళంగా అందజేశారు.

తహసీల్దార్‌కు శుభాకాంక్షలు

తిరుమలాయపాలెం: ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన విల్సన్‌ను బుధవారం ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్‌గౌడ్, నాయకులు మందడి ఇజ్రాయిల్, కిరణ్, సుధాకర్‌రెడ్డి, మిరియాల విక్రమ్‌రెడ్డి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ పూజలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీగంజ్‌లో ఉన్న శ్రీ విజయగణపతి దేవస్థానం ఏకత్రింశతి వార్షికోత్సవ కార్యక్రమాలను బుధవారం మంగళ వాయిద్యాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పంచామృతాలతో అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించగా.. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు యర్రం బాలగంగాధర్‌తిలక్, దేవస్థానం గౌరవ అధ్యక్షుడు అనుమోలు రమేష్, రాయపూడి వెంకటరామారావు, బోజెడ్ల సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, వెంకన్న, ఉపేందర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గుదిమళ్ల వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సుధాకర్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్లకు చెందిన చేకూరి సుధాకర్ హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ సత్యసావిత్రి పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. తాజాగా జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో వీసీ టీకేకే.రెడ్డి అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక

కూసుమంచి: యాదవ మహాసభ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా దాసరి వెంకన్న, గౌరవ సలహాదారు నూకల మల్లయ్య, మండల అధ్యక్షుడిగా బారి రమేష్, కార్యదర్శిగా బక్కతట్ల ఉప్పయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బారి సురేష్, యూత్ అధ్యక్షుడిగా ఆదెపు సతీష్, కార్యదర్శిగా బెల్లి శ్రీశైలం తదితరులను ఎన్నుకున్నారు. అంతేకాక పాలేరు నియోజకవర్గ కమిటీ సభ్యులుగా కన్నెబోయిన నాగేశ్వరరావు, ఎల్లావుల కృష్ణయ్య, మక్కపల్లి రామకృష్ణ, చిమ్మట నర్సయ్య ఎన్నిక కాగా, జెడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని పార్టీలు తమ అభ్యర్థులుగా యాదవులకు టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

నేడు రక్తదాన శిబిరం

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డి గెలుపొంది గురువారంతో ఏడాది పూర్తవుతున్న నేపథ్యాన గట్టయ్య సెంటర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాక కాంగ్రెస్ శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్యాలయ నిర్వాహకులు తెలిపారు.

నకిలీ విత్తనాల బారిన పడొద్దు

కామేపల్లి: రైతులు నకిలీ విత్తనాల బారిన పడి మోసపోవద్దని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. బుధవారం మండలంలోని హరిశ్చంద్రాపురం, శ్రీరాంనగర్‌తండా, రామకృష్ణాపురం గ్రామాల్లో రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విత్తనాల కొనుగోలు విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలని, కొన్న ప్రతీ ప్యాకెట్ రశీదును భద్రపర్చుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు విత్తనాలు విక్రయిస్తే వారి వివరాలను వెంటనే పోలీసులు, వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. బీటీ-3 విత్తనాలను సాగు చేయడం నేరమని సూచించారు.

శివాలయం హుండీ ఆదాయం లెక్కింపు

కూసుమంచి: కూసుమంచి శివాలయం హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ భద్రాచలం డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ లెక్కింపులో మొత్తం రూ.34,269 ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, ఈఓ కాముని శ్రీకాంత్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.


బైరవునిపల్లి వద్ద పనులు చేస్తున్న కూలీలు

పని చేసి.. పస్తులు!

గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు 100 రోజులు పని కల్పించి 15 రోజుల్లో వేతనాలు అందించేలా కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే కూలీ డబ్బులపై ఆధారపడి జీవిస్తున్న పలు కుటుంబాలకు గత ఐదారు వారాలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకుల నిర్లక్ష్యంతో పనులు చేసి పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించిందని ఆరోపిస్తూ.. బకాయిల సాధనకు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.


కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అందని 'ఉపాధి' వేతనాలు..
- ఐదారు వారాలుగా చెల్లింపుల్లో జాప్యం
- ఎదురుచూడలేక వ్యవసాయ పనులకు వెళ్లేందుకు కూలీల అడుగులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజాసంఘాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు సీజన్ ముగిసే సమయం వస్తున్నప్పటికీ కూలీల వేతనాలు ఇంక అందించలేదు. ఎర్రటి ఎండలో సుదూర ప్రాంతాలకు వెళ్లి కనీస సౌకర్యాలు లేకపోయినా నానా అవస్థలు పడుతూ పనులు చేశారు. కానీ చేసిన పనికి వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నుంచి ఇప్పటి వరకు చాలా మందికి కూలీలకు వేతనాలు రాలేదు. దీంతో పనులు మానేసి ఇతర పనులకు వెళ్లాలని పలువురు కూలీలు నిర్ణయించుకుంటున్నారు.

పేరుకుపోతున్న బకాయిలు..

పాలేరు నియోజకవర్గంలోని ఉపాధి కూలీల బకాయిలు పేరుకుపోతున్నాయి. నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాలకు చెందిన ఉపాధి కూలీలకు దాదాపు ఐదు నుంచి ఆరు వారాలకు చెందిన వేతనాలు మూలుగుతున్నాయి. చెల్లింపుల జాప్యం కావడంతో ఉపాధి పనులకు రాకుండా రైతువారి పనులకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అధికారులు నిర్లక్ష్య కారణంతో ఈ పనులు వచ్చే వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. భారీ మొత్తంలో బకాయిలు ఆగినట్లు కూలీలు చెబుతుండగా.. బకాయిల సాధనకు సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల బాధ్యులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలి..



ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు డబ్బులు ఇంకా అకౌంట్‌లో జమకాలేదు. చేసిన పనులకు రావాల్సిన డబ్బుల కోసం ఇంకెన్నాళ్లుగా ఎదురు చూడాలి. పనులు చేసి పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా అధికారులు స్పందించి వేతనాలు సకాలంలో అందించేలా చూడాలి.
– చట్టు చంద్రమ్మ, సుర్దేపల్లి, ఉపాధి కూలీ

ఐదు వారాలుగా రావడం లేదు..



ఐదు వారాలుగా ఉపాధి కూలీల వేతనాలు రావడం లేదు. రెండు వారాలకే కూలీల ఖాతాలో జమ కావాల్సి ఉండగా.. అధికారులు చెల్లింపులపై దృష్టి సారించడం లేదు. కూలీ డబ్బులపై ఆధారపడి జీవిస్తున్న మా పరిస్థితిని అర్థం చేసుకుని వేతనాలు త్వరగా అందించాలి.
– పి.పుల్లమ్మ, అనంతనగర్, ఉపాధి కూలీ

ఆందోళనలు చేస్తాం..



ఉపాధి కూలీలకు రావాల్సిన వేతనాలు వెంటనే చెల్లించకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తాం. పనులపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. చేసిన పనికి వేతనాలు ఇవ్వకపోవడం మరీ దారుణం.
– పొట్టీయ శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు


కామేపల్లి: ఊట్కూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుధాకర్

భూ సమస్యల పరిష్కారానికే..

కామేపల్లి: భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి ద్వారా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కార మార్గం చూపిస్తున్నట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని ఊట్కూర్, లాల్యతండాలో నిర్వహించిన సదస్సుల్లో మొత్తం 228 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సక్రు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాదాబైనామా దరఖాస్తులే ఎక్కువ..

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: ఖమ్మంఅర్బన్ మండల పరిధిలోని వెలుగుమట్ల రెవెన్యూ గ్రామసభను గొల్లగూడెం పాఠశాలలో నిర్వహించగా.. 113 దరఖాస్తులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇందులో సాదాబైనామాకు సంబంధించిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయని తహసీల్దార్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సాయినరేష్, కార్పొరేటర్లు లకావత్ సైదులు, కూరాకుల వలరాజు, రావూరి కరుణసైదబాబు, వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. అలాగే రఘునాథపాలెం మండలంలో వేపకుంట్ల రెవెన్యూ గ్రామ సభ వేపకుంట్ల పాఠశాలలో నిర్వహించగా.. 203 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ ప్రవీణ్ తెలిపారు. వీటిలో అత్యధికంగా సాదాబైనామా, అటవీ భూములకు హక్కుల కోసం అందించినవే ఉన్నాయన్నారు. అదేవిధంగా శివాయిగూడెంలో జరిగిన సదస్సులో మొత్తం 19 దరఖాస్తులు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ మురళీధరరావు, ఆర్ఐ సత్యనారాయణ తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో 254వ సర్వే నంబర్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ బుధవారం తిరుమలాయపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో సీపీఎం నాయకులు ఫిర్యాదు చేశారు. కొందరు అక్రమంగా ఒక ఎకరం పట్టా పొంది ఎటువంటి ప్రొసీడింగ్స్ స్కెచ్ మ్యాప్ పుస్తకం లేకుండా సాగు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. తిరుమలాయపాలెంలో 54 దరఖాస్తులు, బచ్చోడులో 104 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ విల్సన్, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, ఆర్ఐలు వీరయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు నివాళి

ఖమ్మం సహకారనగర్: బోనకల్ మండలం చిరునోముల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నల్లగట్ల వెంకటకృష్ణ ప్రసాద్(54) మృతి పట్ల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నివాళులర్పించారు. బుధవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న కలెక్టర్ మామిళ్లగూడెంలోని హెచ్‌ఎం నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

గుండెపోటుతో సీసీ మృతి


శ్రీనివాసరావు(ఫైల్)

నేలకొండపల్లి: వైరా మండల సమాఖ్యలోని మండల క్లస్టర్ కో–ఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మండలంలోని అజయ్‌తండాకు చెందిన తేజావత్ శ్రీనివాసరావు (40) గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం మండలంలోని మంగాపురంతండాలో జరిగే ఇంటి ముత్యాలమ్మ తుల్జా భవాని పండుగకు బంధువుల ఇంటికి వెళ్లగా.. మధ్యాహ్నం ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పగానే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సునీత స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు.

పెద్దాస్పత్రిలో బోర్లు..

ఖమ్మంవైద్యవిభాగం: పెద్దాస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న రెండు నీటి బోర్ల డ్రిల్లింగ్‌ను సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ బి.రాంబాబులు బుధవారం ప్రారంభించారు. ఇటీవల పార్లమెంట్ సభ్యుడు రఘురామ్‌రెడ్డి ఆస్పత్రిని సందర్శించిన సమయాన సదుపాయాలపై ఆరా తీయగా.. మార్చురీలో ఫ్రీజర్ల కొరత ఉందని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు 8 ఫ్రీజర్లను ఎంపీ నిధుల నుంచి కేటాయించడంతో పాటు ఆస్పత్రిలో తరచూ నీటి కొరత ఏర్పడుతుందని తెలుసుకొని రెండు బోర్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశారు.


బోర్ల డ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

సభ్యుల సహకారంతో సొసైటీ బలోపేతం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంస్థ చైర్మన్ రాజు, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి పథంలో సాగుతోందని సంస్థ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు అన్నారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. సొసైటీ పరిధిలో మొత్తం 112 బ్రాంచ్‌లు ఉండగా.. సభ్యుల సహకారంతో బ్రాంచ్‌ల నిర్వహణ విజయవంతంగా సాగుతోందన్నారు. అనంతరం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో సొసైటీ రూ. 4,500 కోట్ల వ్యాపారంతో కొనసాగుతుండగా.. ఖమ్మం బ్రాంచ్ అగ్రభాగాన ఉందన్నారు. తొలుత కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి చైర్మన్ ప్రారంభించారు. ఈ సమావేశంలో సొసైటీ సిబ్బంది జి.సాయిబాబా, కె.సైదేశ్వరరావు, టి.ప్రమోద్‌కుమార్, కె.రాజేష్, సీహెచ్.రాంగోపాల్, ఎం.మహేష్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి ఆహ్వానం

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంలో గంగమ్మ దేవాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవానికి రావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ నెల 5 నుంచి 8 వరకు ఉత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, జిల్లా నాయకులు కొడాలి గోవిందరావు, మాజీ సర్పంచ్ లిక్కి వీరబాబు, యర్రయ్య, అమరనేని రాము తదితరులు పాల్గొన్నారు.

● పరామర్శ..


వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి గ్రామంలో బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించి పలువురి కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షుడు జోనబోయిన పాపయ్య కుమారుడు వెంకటేష్ చిత్రపటానికి నివాళులర్పించాక ముస్లిం మైనారిటీ నాయకుడు ఎస్‌కె. ఖాదర్‌సాహెబ్, రైతు పరిమిశెట్టి వీరబాబు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

● వినతి..

కూసుమంచి: గతంలో గొర్రెల యూనిట్లు మంజూరు కాని యాదవులకు రూ.2లక్షల నగదు బదిలీ చేపట్టాలని కోరుతూ యాదవ మహాసభ ఆధ్వర్యాన బుధవారం నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి విన్నవించారు. దీంతో పాటు యాదవులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. యాదవుల సమస్యలు, సంక్షేమంపై మంత్రితో చర్చించారు. కాగా, యాదవుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కోడి లింగయ్య, కార్యదర్శి గుమ్మ రోశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బారి మల్సూర్, మండల అధ్యక్షుడు బారి రమేష్, నాయకులు దాసరి వెంకన్న, మల్లయ్య పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పంటలకు గిట్టుబాటు ధరలేక కోల్డ్ స్టోరేజ్, గిడ్డంగులలో నిల్వ చేసుకున్న రైతాంగ పంటలకు వడ్డీ లేని రుణాలు వెంటనే ఇవ్వాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) ఖమ్మం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యాన బుధవారం కలెక్టర్‌కు డీఆర్‌ఓ ద్వారా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున దానికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, సాగుకు అయ్యే ఖర్చులకు గాను రుణాలు ఇవ్వాలన్నారు. రైతులకు మార్కెట్ కమిటీ రుణాలు ఇవ్వకుండా కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారని, వెంటనే రుణాలు ఇప్పించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేసుకోండి


మంజూరు పత్రాలు అందిస్తున్న చైర్మన్ సీతారాములు

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. బుధవారం మండలంలోని గువ్వలగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతనే పేదోడి సొంతింటి కల నెరవేరుతుందని, పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేని బీఆర్‌ఎస్ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉన్న ప్రతీ పేదోడికి ఇంటిని మంజూరు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, మాజీ సర్పంచ్ లిక్కి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం

విపత్తులు ఎదుర్కోవడంపై అవగాహన

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాకాలంలో ఎదురయ్యే వరదలు, విపత్తులను ఎదుర్కొనేందుకు కేఎంసీ ఆధ్వర్యాన డీఆర్‌ఎఫ్, ఆపద మిత్రలు, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం చేత అవగాహన కల్పించారు. బుధవారం నగరంలోని కాల్వొడ్డు సమీపాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ టీం కమాండర్ గౌతమ్‌కుమార్ వరదల సమయాన చేపట్టాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. స్వీయ రక్షణతోనే ప్రజలు వరద ముంపునకు గురికారన్నారు. అనంతరం కేఎంసీ ఏఎంసీ అహ్మద్ షఫీ ఉల్లా మాట్లాడుతూ.. ఆపద మిత్రలు ప్రజలను అప్రమత్తం చేసి, అధికారులకు వరదలపై సమాచారం ఇవ్వాలన్నారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ..


పనులను పర్యవేక్షిస్తున్న వార్డు ఆఫీసర్లు

నగరంలోని డివిజన్లలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను వార్డు ఆఫీసర్లు పర్యవేక్షిస్తున్నారు. తమకు కేటాయించిన వార్డుల్లో పర్యటించిన వార్డు ఆఫీసర్లు కార్మికుల హాజరు పరిశీలించి, ఎవరెవరు ఎంత వరకు పనిచేశారని ఆరా తీశారు. ఇక నుంచి పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించనున్నారు.

పేదల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఐ నేత జానీమియా

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మం అర్బన్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పేదలను తీవ్రంగా వంచించిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ జానీమియా మండిపడ్డారు. బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి సుమారు రెండేళ్లు కావొస్తున్నా ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు వంటి అనేక కీలకమైన వాగ్దానాలు చేసి పేద ప్రజలను ఇబ్బందుల్లో నెట్టేస్తుందన్నారు. రాజీవ్ యువ వికాసం పేరుతో యువతను ఆగం చేస్తుందన్నారు. నిజమైన అర్హులకు కాకుండా ఇందిరమ్మ కమిటీలు సూచించిన వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. నగరంలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేశ్, మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, మండల సహాయ కార్యదర్శి భాగం ప్రసాద్, జూల వెంకటేశ్వర్లు, పల్లెలపాటి నాగేశ్వరరావు, బోడ చిన, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రపంచగతిని మారుస్తున్న కృతిమ మేథ

ఖమ్మంసహకారనగర్: కృత్రిమ మేధ ప్రపంచ గతిని మారుస్తుందని ఎస్‌విటీ గోవా ప్రొఫెసర్ డాక్టర్ ఎ.దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎస్‌బీఐటీ కళాశాల ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంటర్నెట్ తర్వాత ప్రపంచాన్ని ప్రభావితం చేసిన అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ కీలక భూమిక వహిస్తాయని అభిప్రాయపడ్డారు. అనంతరం కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులకు కావాల్సిన సూచనలు, సలహాలను అందించి వారిలోని సృజనాత్మకతను పొగిడారన్నారు. తర్వాత కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్ మాట్లాడాక దామోదర్‌రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావులతో పాటు స్ఫూర్తి, అశ్విని, సవిత, జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన డీవైఎఫ్‌ఐ సైకిల్ యాత్ర

ఖమ్మంఅర్బన్: డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న యువ చైతన్య సైకిల్ యాత్ర ఐదో రోజు బుధవారం ఖానాపురం హవేలీకి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక యువత, ప్రజా సంఘాల నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. 250 కి.మీ.లు యాత్ర పూర్తయిన సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన దిమ్మపై డీవైఎఫ్‌ఐ జెండాను డీవైఎఫ్‌ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి నిరుద్యోగ భృతి రూ.10వేలు అందించాలని, గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణలు యాత్రకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శీలం వీరబాబు, మాజీ రాష్ట్ర నాయకుడు ఎంఏ జబ్బార్, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, మాజీ డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకుడు దొంగల తిరుపతిరావు, ప్రజా సంఘాల నాయకులు పిన్నింటి రమ్య, గాలి వెంకటాద్రి, గాలి అంజయ్య, చింతల రమేష్, గుమ్మ ముత్తరావు, బొడ్డు మధు, తదితరులు పాల్గొన్నారు.

సైనికుడికి సన్మానం


సంపత్‌ను సన్మానిస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ఆర్మీవీరుడు కొత్త సంపత్‌ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ నేతృత్వాన కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌లు బుధవారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శాలువా కప్పి సత్కరించారు. అనంతరం టీడబ్ల్యూజేఎఫ్ బృందం సంపత్‌ను సన్మానించింది. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన తమ యూనియన్‌కు చెందిన జర్నలిస్టు సోదరుడు కొత్త యాకేష్ తమ్ముడైన సంపత్ లాంటి ఆర్మీవీరులను సన్మానించుకోవాల్సిన అవసరం ఉందని టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా బాధ్యులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, వేగినాటి మాధవరావు, కూరాకుల గోపీ, కె. వెంకటరత్నం, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, పత్తి శ్రీనివాస్, యాస లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

'లక్ష'ణంగా వదిలేసి..!


పంట పొలంలో పడేసిన పరికరాలు, వాలీబాల్ నెట్

గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికితీసేందుకు గత ప్రభుత్వ హయాంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అయితే మండలంలోని ఆజయ్‌తండా పంచాయతీలో నిర్మించిన క్రీడా ప్రాంగణం మాత్రం కనుమరుగైంది. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన క్రీడా పరికరాలను పంట పొలాల్లో పడేయడంతో దాని రూపురేఖలే లేకుండా పోయాయి. అంతేకాక అందులోని వాలీబాల్ నెట్ పనికి రాకుండా పోతుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది.
– నేలకొండపల్లి